# నా జీవితానికిది చాలు

— టి.యస్. హరగోపాల్



"వాసాంసి జీర్ణాని యథావిహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి
తథాశరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ"

చినిగిపోయిన పాత బట్టలను విడిచి మను జుడు యితరములగు క్రొత్త బట్టల నెట్లు ధరించు చున్నాడో, అట్లే దేహియగు ఆత్మయు శిథిలములైన పాత శరీరములను వదలి యితరములగు క్రొత్త శరీరములను ధరించుచున్నాడు.

పవిత్ర కృష్ణానదీ తీరాన, భార్యకి తర్పణం వదు లుతున్న రాజశేఖరానికి కంటి వెంట నీళ్ళు వచ్చాయి. తన భార్య కూడా పాత బట్టలను విడిచినట్టుగా పాత శరీరాన్ని వదలివేసి వెళ్ళిపోయింది.

తానిప్పుడు ఒంటరి.

తనతో జీవితాన్ని పంచుకునే అర్ధాంగి యింక లేదు.

ఇంట్లోనూ, ఆఫీసులోనూ తన కష్ట, సుఖాల గురించి చెప్పకోటానికింక ఎవ్వరూ లేరు.

ఈ ముగ్గురు పిల్లలు ఎప్పటికి పెరిగి, పెద్దవాళ్ల య్యేను!

తను వాళ్ల నెలా పెంచాలి!

దిక్కులేని పక్షులయ్యాము!

"బాబూ! యింక లేవచ్చు" కర్మ చేయించే బ్రాహ్మ ణుడు అనటంతో ఈ లోకంలోకి వచ్చిన, రాజశేఖర్ లేచి, నెమ్మదిగా నడచి, కారులో కూర్చున్నాడు.

అతని తమ్ముడు అక్కడి సామగ్రినంతా కారులో వుంచి, కారుని స్టార్టు చేశాడు.

"తొందరలో ఏదో చిన్న మాట అంటే, ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు"

చిన్నమాట!

అది చిన్నమాట ఎలా అవుతుంది!

"చావు, నువు ఛస్తే, పీడా విరగడవుతుంది. నేనూ, నా పిల్లలు మా చావు మేం ఛస్తాం"

అసలు తన తప్పేమీ లేకపోయినా, తానామెను అంత మాటన్నాడు.

కొడుకు సరిగా చదవటం లేదని మందలిస్తుంటే, ఎక్కడ కొడుకు నొచ్చుకుంటాడోనని తను మధ్యలో కల్పించుకుంది.

అంతే, ఒక్కమారుగా తన కోపం భార్యపైకి మళ్లింది. విచక్షణా రహితంగా అంత మాటన్నాడు.

అసలు తనకీమధ్య కోపం ఎక్కువైంది.

ఆఫీసులో పని ఒత్తిడి.

ఎదిగే పిల్లలు.

చాలీ చాలనీ జీతం.

ఆశలెక్కువ.

స్థలం కొన్నాడు. ఇల్లు కట్టటానికి బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాడు. అది చాలక సొసైటీ అప్పు బయట చిట్‌ఫండ్, ఆఫీసులో చిట్‌ఫండ్. భార్య నగలని తాకట్టుపెట్టి అప్పు.

ఆ ఇల్లు కట్టకుండా వుంటే, రెండు చేతులా డబ్బు ఖర్చు పెట్టుకోటానికి డబ్బు వుండేది.

ఐనా, తన మనసు ఆమెకి తెలుసు, ఏదో చిరా కులో అంటే తనకి శిక్ష వేస్తుందా!

అంతా ఆశ్చర్యంగా వుంది.

తెల్లారేసరికి పిల్ల లొక్కసారిగా! "అమ్మలేదు.... అమ్మ ఏది..." అని అరిచి, ఏడ్పు మొదలెట్టేస రికి, తాను విద్రమత్తులో నుంచి లేచి, "ఏమైంది, ఇక్కడే ఎక్కడో వుంటుంది.... ఆంటీ వాళ్లింటికి వెళ్లి వుంటుంది చూడండి" అంటూ తనూ వెత కటం మొదలు పెట్టాడు.

ఏడు

ఎనిమిది

తొమ్మిది

వాళ్ళ అన్నయ్య ఇంట్లోనూ లేదు.

గురువారం కదా సాయిబాబా గుడికి వెళ్ళి వుంటుందని చూశారు, లేదు.

సామాన్యంగా తను వెళ్ళే చోటికల్లా ఫోను చేశారు, లేదు.

తొమ్మిది గంటలకు, ఎంతో గాభరాగా పరుగు తీసి, పోలీసు స్టేషన్‌లో కంప్లైంట్ చేశారు.

పిల్లలు ఏడ్పులు

పోలీసులు ప్రశ్నలు

స్నేహితులు, చుట్టాల పరామర్శలు

ప్రమోదిని ఫోటో తీసుకున్నారు పోలీసులు.

"వెళ్లేటప్పుడు ఏ డ్రస్సు వేసుకుందని" అడిగాడు యినస్పెక్టర్.

వెళ్తుందని తెలిస్తేగా, వెళ్లేటప్పుడు ఏ డ్రస్సు తీసు కుందో చెప్పటానికి!

పోలీసుల అనుమానపు ప్రశ్నలు!

ఎవరో తన భార్య ఎవరితోనో లేచిపోయి వుంటుం దని కామెంట్ చేశాడు.

పిచ్చికోపం వచ్చింది తనకు

తన కోసం, పిల్లల కోసం నిత్యం తపనపడే తన భార్య గురించి అంత అపవిత్రంగా వాళ్ళు మాట్లా డటం సహించలేక పోయాడు.

కాని సంఘం ముందు తాను నిస్సహాయుడు.

ఒక రోజు గడిచింది.

రెండు రోజులు గడిచాయి.

మూడో రోజు ఉదయం ఇనస్పెక్టర్ తమ ఇంటికి వచ్చినప్పుడు ఏమైనా సమాచారం అందిందేమోనని ఆతృతగా ముందుకు వెళ్లాడతాను.

ఇనస్పెక్టరు ముఖం విషాదంగా వుంది.

"సారీ, రాజశేఖర్‌గారూ, ఐ డోంట్‌నో వెదర్ అవర్ యిన్ఫర్మేషన్ యీజ్ కరెక్ట్ ఆర్ నాట్... మా యిన్ఫర్మేషన్ తప్పవ్వాలనే ఆశిస్తున్నాం".

"చెప్పండి... ఏమయింది?"

"రైలు పట్టాల ప్రక్కన ఓ శవం పడివుంది. గుర్తు పట్టటానికి వీలు లేకుండా ముఖం చెక్కేసి వుంది. ఐతే, మీరు చెప్పిన ఆనవాళ్లు బట్టి, మీ భార్య ప్రమోదిని గారిదేమోనని అనుమానం." తన గుండె ఒక్కసారిగా ఆగిపోయింది.

తన భార్యని ఎవరో హత్యచేశారా!

గుర్తు పట్టటానికి వీలు లేకుండా, ముఖాన్ని చెక్కేశారా!

ఎవరింత దారుణానికి ఒడిగట్టింది!

ఎందుకు!

తన భార్య అసలక్కడి కెందుకు వెళ్లింది!

"ఒక్కమారు వెళ్లొద్దామా సర్, మీ భార్య కాక పోవచ్చు. మా అనుమానం నివృత్తి అవుతుంది".

తాను, పిల్లలు కారులో పోలీసు జీపు వెంట వెళ్ళారు.

పట్టణానికి దూరంగా, పట్టాల ప్రక్కన శవం పడి వుంది. ప్రజలు గుంపులు, గుంపులుగా వున్నారు.

చాలా భయంకరంగా వుంది.

ముఖం చెక్కేసి, వికృతంగా వుంది.

కాని, శరీర సౌష్ఠవాన్ని బట్టి తాను గుర్తుపట్టగలిగాడు.

ఔను, ప్రమూనే.

"నాన్నా, అమ్మే... ఆ చీర, జాకెట్టు అమ్మవే.." పిల్లలు గుర్తు పట్టారు.

ప్రజల్లో ఒక్కమారుగా కలకలం!

తాను భూమిమీద నిలద్రొక్కుకోలేక పోయాడు.

పిల్లలు తల్లి శవం మీద పడి ఏడుస్తున్నారు.

పోలీసులు ప్రజలను ఒకవైపు దూరంగా నెట్టేస్తూ, తనని, పిల్లలని ఊరడించటానికి ప్రయత్నిస్తున్నారు.

శవాన్ని పోస్టుమార్టంకి పంపి, తనని, పిల్లల్ని ఇంటి దగ్గర వుండమన్నారు పోలీసులు.

క్షణాల్లో అందరికీ తెలిసిపోయింది.

తన వాళ్లు, ప్రమూ తరపు వాళ్లు ఆదుర్దాగా వచ్చేశారు. వాళ్లడిగే ప్రశ్నలకి తన దగ్గర సమాధానం లేదు.

రెండు గంటల్లో పోలీసులు శవాన్ని తీసుకుని వచ్చి, తమ అధీనం చేశారు.

నిన్నటి వరకు ఉందనుకున్న తన ప్రమూ ఈనాడు లేదు.

బంధువులు, మిత్రులు, ఆఫీసువాళ్లు, తన పిల్లల స్నేహితులు ... ఎందరు .... ఎందరు ....

అవును, చావుకూడా పెళ్లిలాంటిదే అన్నారు.

శవ సంస్కారానికి ఊరువూరంతా వచ్చినట్లుగా వుంది. ప్రమూ శరీరం భస్మమై రెండు రోజులైంది.

వాకిట్లో కూర్చుని, భార్యనే తలపోస్తూ, రాజశేఖర్ తనలో తాను కుమిలిపోతున్నాడు.

ఎవరో ఒకరు వస్తున్నారు, పోతున్నారు.

పరామర్శలు

సుఖాల్లో పాలు పంచుకుందో లేదో గాని, కష్టాల్లో పాలు పంచుకుంది.

తనకి ఇంట్లో సమస్య వచ్చినా, ఆఫీసులో సమస్య వచ్చినా, తానే ధైర్యం చెప్పి, సలహా ఇచ్చేది.

బ్యాంకులో డిమాండ్ డ్రాఫ్టుల కుంభకోణంలో "తప్పు మనం చేయనప్పుడు, మనం భయము, బాధ పడట మెందుకు! పోలీసులకి మీ ఆర్.ఎం.కి రిపోర్టివ్వండ"ని తనకి నైతిక బలాన్నిచ్చింది.

పిల్లలు చదువులో వెనకబడినప్పుడు, "పెద్ద స్కూళ్లలో కావాలని చేర్చి, మార్కులు తక్కువ వచ్చాయనుకుంటే ఎలా, చిన్న ప్రైవేటు కాన్వెంట్‌లో చేర్పిస్తే, మన పిల్లలకీ ఎనబైలొస్తాయి. వాళ్ళే చదువుకుంటార"ని ధైర్యం చెప్పేది.

ఆర్థికంగా ఇబ్బంది పడ్తున్నప్పుడు, "కావాలని ఇల్లు కట్టుకున్నాం. కొద్ది రోజులిబ్బంది పడ్తాం. ఈలోగా మీ జీతం పెరగదా? పిల్లలు పెద్ద వాళ్లయితే, ఇంత ఖర్చులుండ వ్", అని ధైర్యం చెప్పేది.

భార్యని "కరణేషు మంత్రి" అన్నారు.

హాయిగా సాగుతున్న తమ జీవితంలో ఈ అపశృతి ఎందుకు!

భగవంతుడు అంత నిర్దయుడా!

కళ్లు మూసుకొని జీవితాన్ని నెమరువేసుకుంటున్నాడు రాజశేఖర్.

ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దం అయింది.

ఇంకెవరు వచ్చారో!

రాజశేఖర్ కళ్లు తెరవలేదు.

రెండు క్షణాలకీ "ఏమండీ" చిన్నగా పిలుపు.

అది ప్రమూ పిలుపు.

ప్రమూ తనని పిలుస్తోంది.

తనని రమ్మంటోందా!

ఈ లోకంలో అందని సుఖ, శాంతులు ఈ కన పడని లోకాల్లోనైనా అనుభవిద్దామని రమ్మంటోందా!

"ఏమండీ"

"ప్రమూ... ప్రమూ..."

"ఏమండీ, నేనే ప్రమూని... ప్రమూని వచ్చేశాను". రాజశేఖర్‌ని తట్టి లేపింది.

"ప్రమూ ... నువ్వు ... నువ్వు..." రాజశేఖర్ ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయాడు.

"నేనేనండీ .. ప్రమూని ...."

ఆ మాటలకి ఇంట్లో నుంచి పిల్లలు వచ్చేశారు.

"అమ్మా" భోరున వాళ్ళ అమ్మని పట్టుకుని ఏడ్చేశారు.

రాజశేఖర్‌కి అది కలో, నిజమో తెలియటం లేదు.

"ప్రమూ ..!నువ్వు ... బ్రతికేవున్నావా ..."

"బ్రతికే వున్నానండి. పేపర్లో నేను చచ్చిపోయినట్లుగా వచ్చిన వార్తనిని, పరుగు తీసుకుంటూ వచ్చా..."

ఇంట్లో నుంచి అందరూ వచ్చేశారు.

"వదినా .... అక్కయ్యా .... అమ్మా ప్రమూ ...." ఎన్నో పిలుపులు.

అందరినీ చూసి ప్రమోదినికి ఒక్క క్షణం మనసు స్తంభించింది.

ప్రమోదినిని పట్టుకుని, అందరూ ఒక్కమారుగా ఏడ్చేశారు ... అది ఆనందమా!

"ఎక్కడికెళ్లావ్ ... ఏమై పోయావ్ ..."

"మనసు పాడయింది. కష్టాలకి ఒక అంతం లేదా అనిపించి, మానసిక విశ్రాంతి దొరుకుతుందని బాబా ఆశ్రమంకి వెళ్ళా... నాల్గు రోజులు ప్రశాంతంగా గడిపా.

ప్రొద్దున్నే బాబా 'నీ కష్టాలు తీరాయమ్మా. ఫాల్స్ కాల్‌తో మీ యింటికి పట్టిన గ్రహ పీడ తొలగిపోయింది. నీ భర్త, పిల్లలు ఎదురు చూస్తుంటారు. వెళ్లిరా'' అని చెప్పారు. బస్సెక్కి వచ్చా".

క్షణాల్లో వార్త తెలిసిన పోలీసులు వచ్చారు.

"నిజమేనా సర్, మేము విన్నది?"

"నిజమే ఇన్‌స్పెక్టర్ గారూ... ఇదుగో నా భార్య ప్రమోదిని...."

"చాలా సంతోషం. ఏమ్మా, ఇంత హడావిడి చేశావ్... ఇంతకీ ఆ శవం ఎవరిది? మీ భార్యదని ఎలా అనుకున్నారు?"

"మానసికంగా కృంగిపోయిన నాకు, నా పిల్లలకి ఆకారాన్ని బట్టి, కట్టుకున్న చీర, జాకెట్టు బట్టి, నా భార్య అనుకున్నాం క్షమించండి, ఇన్‌స్పెక్టర్ గారూ... ఆ శవం ఏ అభాగినిదో!"

"ఓకే, పోనివ్వండి రాజశేఖర్‌గారూ. మీరు సాయంత్రం వచ్చి, మీ కంప్లయింట్ వాపసు తీసుకోండి", అని కరచాలనం చేసి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్. ఒక్కమారుగా ఇంట్లో పండుగ సందడి వచ్చింది.

అప్పటి వరకు శ్రాద్ధకర్మలకి కావలసిన వంటలు చేస్తున్న వంటవాళ్ళని తీపి పిండి వంటలేమైనా చేయమని ఆదేశించాడు రాజశేఖర్.

సాయంత్రానికల్లా ఎవరిళ్లకి వాళ్లు వెళ్ళిపోయారు.

పిల్లలు జరిగిందంతా ఓ కలలా మరచిపోయి, పుస్తకాల సంచులు తీశారు.

రాత్రి పది గంటలకు భర్త దగ్గరకు వచ్చిన ప్రమోదినిని , ''రా, ప్రమూ'' అని దగ్గరకు తీసుకొన్నాడు రాజశేఖర్.

"నన్ను క్షమించు ప్రమూ..." ఒక్కమారుగా రాజశేఖర్ ప్రమూ చేయి పట్టుకుని ఏడ్చేశాడు.

"ఛ, ఎందుకండీ, మీరేం తప్పు చేశారు? తప్పు నాదే, చెప్పకుండా వెళ్లటం ..."

"లేదు ప్రమూ... నిన్ననవసరంగా తిట్టేను. అసలు ఈ మధ్య సంస్కారాన్ని కూడా మరచి ప్రవర్తిస్తున్నా. అంతకంటె కూడా ఎవరో అభాగిని శవాన్ని చూసి, నువ్వనుకుని భ్రమపడి, నీ శ్రాద్ధ కర్మలు చేశా... ఇంతకంటె పాపం ఇంకేమైనా వుందా!"

"లేదండీ, నేను బాధపడటం లేదు. ఎందరికి ఈ అదృష్టం వస్తుంది. నేను బ్రతికుండగానే నా భర్త చేత ఉత్తర కర్మలు చేయించుకున్నా. రేపు నేను నిజంగా చచ్చిపోయినా, నా గురించి ఎవరైనా బాధపడ్తారా, లేదా అనే అనుమానం ఇంకా నాకు లేదు. నేను చనిపోతే, నా కోసం విలపించేవాళ్ళు ఎంత మందున్నారో కళ్లారా చూశా... నా కోసం 'ప్రమూ, ప్రమూ' అని కలవరించే భర్తని చూశా 'అమ్మా' అనే నా పిల్లల పిలుపులోని మాధుర్యాన్ని అనుభవించా. తల్లిదండ్రులు, అత్తమామలు, అన్నదమ్ములు, మరిది, యింతమంది చుట్టాలు, స్నేహితులు... వీళ్లందరిలో నేనంటే వున్న అభిమానాన్ని చూశా. ఈ ఇంట్లో నా ఉనికికేమైనా విలువుందా అనే నా మనసు లోని అనుమానం పటాపంచలయింది... ఇది నా ఇల్లు... నా భర్త ... నా పిల్లలు ... నా చిన్న సామ్రాజ్యం... నా రాజ్యానికి నేనే రాణిని ... నా కింకా ఇంతకంటె ఏం కావాలి? నా జీవితానికిది చాలు. నేను ఇంక నిజంగా చచ్చిపోయినా ఫర్వాలేదు."

ప్రమోదిని ఆనందపుటావేశానికి రాజశేఖర్ తన చేతిని ఆమె నోటి కడ్డం పెట్టి, ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. ఆమె అతనిలో గువ్వలా ఒదిగిపోయింది.

● ●